# నటుడు కావాలని లేచిపోయిన బాజానీ

బాజానీ యువకుడు, రూపసి. అతని నవీన నాగరికతా వ్యామోహము సినీమాలు చూచుటవల్ల కలిగిన మనః పరిణామము ఈకథలో చక్కగా చిత్రింప బడ్డాయి.

రచయిత:

## పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.యే.

తలమీద వెంట్రుకకూడా రేగనీయడు బాజానీ. ఎప్పుడు చూచినా క్రాపింగు అప్పటి కప్పుడు దువ్వి పెట్టినట్టు కనిపిస్తుంది. షరాయి, చొక్కా కూడా ప్రతిక్షణమూ చెక్కుచెదరకుండా ఉంటవి; ఏదైనా కాస్త మరకపడ్డదంటే చాలు వెంటనే విడిచేసి మరొకటి తొడుక్కోవలసిందే. మనిషికూడా ఎర్రగా, అందంగా, ఆడపిల్లలుగల మహమ్మదీయ గృహస్థులకు ఆశలు గొలుపుతూ ఉంటాడు.

అతని పుస్తకాలుకూడా నిత్యనూతనాలు; అప్పుడే బజారునుంచి కొనుక్కొచ్చాడా అనుకుంటాం. ఎప్పుడైనా వాటిని చదువుకోటాని కంటూ తెరచిన పాపాన పోతేనా మరి !

చిన్నప్పుడే తండ్రి చనిపోయిన కారణంచేత తల్లి మహా అబ్బరంగా పెంచింది. పినతండ్రికూడా— ఏమన్నా అంటే తల్లిమనస్సుకు కష్టమనిపిస్తుందేమోనని—అతడు చదివినా, చదవకపోయినా, ఎలా తిరిగినా, ఏమీ దండించేవాడు కాదు అదికాక, పెద్ద చదువు చదువుకుని ఉద్యోగం చేయవలసిన యావశ్యకత లేదాయెను. మోటార్ల వ్యాపారం ఉంది; యేటా కావలసినంత లాభం కనిపిస్తోంది.

మునిసిపల్ హైస్కూల్లో చదువుతున్నాడు బాజానీ. పినతండ్రి మునిసిపల్ కౌన్సిలులో మెంబరు కావటంచేత బాజానీ ప్రతియేటా పాసౌతూ వచ్చాడు. కాని స్కూలుఫైనలుక్లాసులో రెండుసార్లు దండయాత్రలు తప్పని సరిగాచేయవలసి వచ్చింది. మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆయేడు ట్యూషన్ చెప్పటానికి నేను కుదిరాను, అప్పటి కతనికి పందొమ్మిది సంవత్సరాల యీడు ఉంటుంది. మనస్సు నూతనాకర్షణలకేసి పరుగెత్తే వయస్సు. బలవంతాన కూచోబెట్టి, కొట్టియైనా చదివించదగినకాలం దాటిపోయింది.

మొదటిరోజుల్లో నేను నాడ్యూటీప్రకారం సరిగ్గా ఉదయం ఎనిమిదింటికిల్లా వెళ్ళేవాణ్ణి. కాని అప్పటికింకా బాజానే నిద్రలేచేవాడు కాదు. నేనువెళ్ళి ఆఫీసుగదిలో కూచుంటే, ఒక నౌకరు మేడమీదికిపోయి ఆయన్ను లేపి నారాక ఎరిగించినమీదట, తిన్నగా లేచి, ముఖం కడుక్కుని, స్నానంచేసి, దుస్తులుధరించి, క్రాపుదువ్వి, కాఫీ త్రాగి, వచ్చేసరికి తొమ్మిదిగంటలయ్యేది. అతనికోసం కూచుని కూచుని విసుగెత్తిపోయేది నాకు. కొన్నాళ్లు చూచాను ఈతరహా తరువాత నేనే తొమ్మిదింటికి రావటం ప్రారంభించా.

మొదటిరోజుల్లో—బాజానీసరుకు నాకు బాగా తెలియనప్పుడొకనాడు ఇంగ్లీషు పాఠంతీసి చక్కగా బోధించుదామని ప్రయత్నంచేశా. నేను చెబుతున్నది గ్రహిస్తున్నాడో లేదోనని మధ్యమధ్య ప్రశ్నలువేస్తే బెల్లంకొట్టిన రాయిలాగు మాటాడకుండా ఉండిపోయాడు. చెప్పిన విషయమే మళ్ళీమళ్ళీ చెప్పవలసి వచ్చింది. అలాగ ఒక అరగంటసేపు గొంతు చించుకున్నమీ

దట 'అరణ్యే మయా రుదితం' అనిపించింది. బాజానీమాత్రం—గుడ్లు నాకూ—శరీరాన్ని కుర్చీకీ—మనస్సును ఎక్కడో — ఒప్పజెప్పి, నిస్సంగియై, మానివలె కూచున్నాడు.

మరొకనాడు లెక్క బాబో లొకటి బోధిస్తోన్నప్పుడు మోటారుకారు బైట ఆగినచప్పుడు వినిపించింది. వెంటనే బాజానీ కిటికీగుండా అటుకేసి ఆప్యాయంగా చూచి, ఆ వచ్చింది ఇంజనీరుగారి 'కార'నీ, రెండు నెలలకింద వాళ్ళ కంపెనీద్వారానే కొన్నారనీ, కొత్త 'మోడల్' అనీ, అది పాతోంటే కాసంతైనా చప్పుడవదనీ,—ఇంకా మోటారుకార్లనుగురించి నాకు తెలియవని తా ననుకున్న విషయా లెన్నో వివరించాడు.

మోటారంటే మాత్రం కుర్రవాడికి చాల సరదా. దాన్ని చూచినప్పు డతనిలోనించి ఒక రకమైన కవిత్వం బయలుదేరుతుంది. విశ్వసౌందర్యమంతా అతనికి మోటారులో కనిపిస్తుంది. తాను స్వయంగా మోటారు నడుపుతూ బ్రహ్మానంద మనుభవించేవాడు. స్వంతకార్లు రెండుమూడు ఉండటంచేత పినతండ్రికి తెలియకుండా, రోజుకు ఒకసారైనా, 'కారె'క్కి నాలుగుబజార్లూ తిరిగి వస్తూండేవాడు.

ఒకనాడు ఉదయం తొమ్మిది గంటలకు చదువు చెప్పటానికి నేను వెళితే, బాజానీ అంతకుముందే మోటారులో ఎక్కడికో వెళ్ళాడని నౌకరు చెప్పాడు. ఆ పాళాన నేను తిరిగి వెళ్ళిపోయినట్టయితే బాగుండేదేమో; త్వరలోనే తిరిగి వస్తాడుగదా అని ఆఫీసులో కూచుని ఉండగా పినతండ్రి వచ్చాడు. బాజానీ ఇంట్లో లేకపోవటం, నేనతనికోసం కాచుకుని ఉండటం, తెలుసుకుని రోజూ ఇలాగే చదువుకోటం తలాయిస్తున్నాడని ఊహించి, చాలకోపం తెచ్చుకున్నాడు. కొంతసేపటికి బైట కారుదిగి బాజానీ లోపలకురాగానే బాగా చీవాట్లు పెట్టాడు. అతనికి కన్నీళ్ళ పర్యంతం అయింది. ఆరోజు ట్యూషన్ లేదు.

మర్నాడు ఉదయం నేను మామూలుగా వెళ్ళినప్పుడు బాజానీ చెప్పాడు : గడచినరోజున తన్ను అన్నిమాటలన్నందుకు పినతండ్రిని వాళ్ళమ్మ కూకలేసిందిట. చిన్నవాడు తెలియక ఏదైనా తప్పు చేస్తే అంత కోప్పడతారా అందిట. ఆమె మాటలకు పినతండ్రి పశ్చాత్తాపపడి జరిగినదానికి పరిహారంగా అయిదు రూపాయలనోటు తనజేబుఖర్చు కిచ్చాట్ట గతరాత్రి తాను స్వయంగా సినీమాకు తీసుకు వెళ్ళాట్ట కూడాను.

హిందీ, ఉరుదు సినీమాలు వస్తే బాజానీ తప్పకుండా వెళ్ళవలసిందే; వెళ్ళొచ్చి కథానాయకుడు ఏయే విలాసవంతములైన దుస్తులు ధరించినదీ—ఎంతెంత యెత్తు గోడలమీదనుంచి దుమికినదీ—మోటారు ఎంత వేగముగా నడిపినదీ—ఈ మొదలైన విషయాలన్నీ నాకు చక్కగా బోధపరచేవాడు.


## కథలపుస్తకాలు

| | | | |
|---|---|---|---|
| కారుణ్యం | 0 | 4 | 0 |
| —కొడవటిగంటి కుటుంబరావు | | | |
| రూమ్ టు లెట్ | 0 | 4 | 0 |
| —పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి | | | |
| స్వగతం | 0 | 4 | 0 |
| —కొడవటిగంటి కుటుంబరావు | | | |
| కలికి | 0 | 4 | 0 |
| —బొడ్డు బాపిరాజు | | | |
| బ్రాహ్మణీకం | 0 | 4 | 0 |
| —గుడిపాటి వెంకటచలం | | | |
| యువ కథావళి | 0 | 4 | 0 |
| —వివిధ రచయితలు | | | |
| ఇల్లరికం | 0 | 4 | 0 |
| —కొడవటిగంటి కుటుంబరావు | | | |
| పాంచజన్యం | 0 | 6 | 0 |
| —చక్రపాణి | | | |
| బడదీదీ | 0 | 4 | 0 |
| —చక్రపాణి | | | |
| త్రిలోచన కవిరాజు | 0 | 6 | 0 |
| —చక్రపాణి | | | |

ఆంధ్రభూమి బుక్ డిపో

వేపేరి : మద్రాసు.

అతనికి 'నెసిల్సు' కంపెనీవారి చాకొలెటు పేకెట్లలో ఉండే హాలీవుడ్ నటీనటకుల బొమ్మల్ని సేకరించటం సరదా.

అద్దంలో చూచుకున్నప్పుడు తనలో ఒక కొత్త సౌందర్యరేఖ ఉపజాతమైనట్టుగా అనుమానం కలిగిండంటే వెంటనే వెళ్ళి ఫోటో తీయించుకువచ్చేవాడు. చేతి 'కెమెరా' వొకటి కొన్నాడు కూడాను. సరదాపుట్టినప్పుడల్లా అది పుచ్చుకుని, నదివొడ్డుకో, పొలాల్లోకో, వెళుతూంటాడు.

ఒక గొప్ప నటుడు కావాలనో—నేర్పరియైన మోటారు-మెకానిక్కు అనిపించుకోవాలనో—సినీమాలో 'కెమేరామాన్' గా తయారవాలనో— అతని మహత్తరమైన ఆశయమై ఉంటుందని నాకుతోచేది. అతని కభిరుచిలేని యీ ఆంగ్లవిద్య మాన్పించి, అతని కిష్టమైన ఆ తోవల్లోకి తిప్పితే బాగుంటుందని పినతండ్రి కెవరైనా బోధించగలిగితే బాజానీకి మహోపకారం చేసినవాడౌతారు. కాని, ఆ పినతండ్రేగారు, దేశంలో చాల మంది తండ్రులు తమ పిల్లల అభిరుచుల్ని పరిశీలించక, వాళ్ళు కనీసం స్కూలుఫైనల్ వరకైనా తప్పకుండా చదివితేనేగాని ఇహపరాలుండవని నమ్ముతున్నారు. కాబట్టి అలాగని పినతండ్రికి నచ్చచెప్పటం కష్టం. ఎవరమైనా అలా ప్రసంగం ఎత్తితే మనం తప్పకుండా ఆ కుర్రవాణ్ణి పాడుచేయటానికి తలపెట్టినట్టు భావించవచ్చు కూడా.

కష్టమో, నిష్ఠురమో, బాజానీ పరీక్షలదాకా ఈడ్చాడు. పరీక్షల్లో తోచినట్టు రాసివచ్చాడు.

పరీక్షాఫలితాలు తెలిసినై; బాజానీ కృతార్థుడు కాలేదు. ఔతాడని అనుకున్నాం కనుకనా?

పరీక్షా ఫలితాలు తెలిసిననాటినించీ బాజానీ ఎక్కడా కనిపించలేదు. ఊళ్ళోకూడా లేనట్టు తెలిసింది. ఒకనాడు వాళ్ళ ఆఫీసులో గుమాస్తా కనబడితే అడిగాను.

"వాడండీ! వాడు చదువుకుని బాగుపడతాట్టండీ! పారిపోయాడు. వెళ్ళిపోయి పూనానుంచి ఉత్తరం రాశాడు మొన్ననే పినతండ్రికి. అక్కడేవో 'ప్రభాత్ కాలేజి' అంటూ ఒకటి ఉందిటగా! సినీమాల్లోకి పనికొచ్చేలాగ తయారు చేస్తారట అక్కడ. అందులో చేరాట్ట. డబ్బు పంపించమంటూ ఉత్తరం రాశాడు. మొన్ననే వొక వందరూపాయలు టెలిగ్రాం మనియార్డరు చేశాడు పినతండ్రి" అని చెప్పాడు గుమాస్తా.


టి. సి. యెన్. గోల్డెన్ నగలే

స్త్రీల కన్నివిధాల అలంకారానికి తగినవి.




2 సంవత్సరములు గ్యారంటీ. కాంతిలోను వన్నెలోను, బంగారుగాజుల కేమాత్రము తీసిపోవు. నలుపెక్కవు.

పెద్దసైజు గాజులు 2 ఇంచి మొదలు పైబడినవి జత 1-కి రూ 3-0-0

మధ్యమసైజు $1\frac{3}{4}$ ఇంచి మొదలు 1 ఇంచిలకులోగా ,, ,, 2-8-0

బేబీసైజు $1\frac{3}{4}$ ఇంచికి లోబడినది ,, ,, 2-0-0

వి.పి. ఖర్చు 1 జత మొదలు 6 జతలువరకు 0-8-0

మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము.

మీరు వ్రాయు ఆర్డరు జాబులయందు 'ఆంధ్రభూమి' పేరు నుదహరించిన మాధరలమీద రూపాయకు ఒక అణా వంతున తగ్గించబడును.

టి. సి. నాగలింగప్ప అండు కంపెని,

280, వాల్‌టాక్సురోడ్, పార్కుటవున్ పోస్టు, మదరాసు.

ఏజంట్సు:—గుప్తా అండ్ కో, మెయిన్‌రోడ్, కాకినాడ.